# ఉబ్బు జబ్బు

అవసరాల రామకృష్ణారావు

అనగనగా ఒక వూళ్ళో ఒక శిల్పి ఉండేవాడు. ఉన్నదున్నట్టు రూపానికి ప్రతిరూపం తయారుచెయ్యడమే కాకుండా కనురెప్పలు ఆడించడం, ఊపిరి పీల్చడం యిలాంటి పనులు చెయ్యగల మరలు సహా అమర్చేవాడు. ఎంత తెలివితేట లున్నవారైనా బొమ్మని అసలు మనిషి నుంచి గుర్తుపట్టలేక పోయేవారు. ఇది యిలా ఉండగా ఒక గొప్ప జ్యోతిష్కుడు శిల్పి చెయ్యి చూసి పదిహేను రోజులనాటికి ఆరు నూరయినా మరణం తప్పదన్నాడు. "ఇది తప్పదా? నా శిల్ప సంపద నన్ను రక్షించలేదా?" అని ఆలోచించగా శిల్పికి మంచి ఉపాయం తోచింది. పదిహేను రోజులూ కష్టపడి, తన మొహం అద్దంలో చూసుకొని తనలాంటి బొమ్మలే మరి నాలుగు తయారుచేశాడు. ఒడ్డూ, పొడవూ, రంగూ, తనకీ బొమ్మలకీ ఒక్క పిసరు తేడా లేకుండా తయారు చేశాడు. సరిగ్గా చావు సంభవించే రోజున ఒకలాంటి పక్కలే అయిదు వేయించి, ఇటు రెండు బొమ్మలూ అటు రెండు పడుకోబెట్టి "ఎవడొస్తాడో చూస్తాగా, ఏం చేస్తాడో చూస్తాగా" అనీ ధీమాగా తను మధ్య పడుకున్నాడు. సరే, యమదూతలు రానే వచ్చారు. అయిదు నిమిషాలు శాయశక్తులా ప్రయత్నించారు. పిలిచి చూశారు, తట్టి లేపారు. ఏమీ తెలియలేదు. ఎవర్ని శిల్పి అనుకుని తీసికెళ్ళడం? కాలం మించి పోకుండా చిత్రగుప్తుడి దగ్గరకు వెళ్ళిపడ్డారు. అతడు శిల్పి జీవితచరిత్ర తీసి చూశాడు: ఒక చోట యిలా ఉంది "ఇంత గొప్ప శిల్పికీ చిన్న అవలక్షణం. ఎవరైనా పొగిడితే యిట్టే లొంగి పోతాడు." ఇంకేం? దొరికేడు దొంగ అనుకున్నాడు చిత్రగుప్తుడు. అతని యింటికి వెళ్ళి స్తుతి పాఠాలు మొదలుపెట్టేడు. "ఎంత సజీవ చిత్రణ! ఎంత చక్కటి శిల్పం! ఏమి చాతుర్యం ఏమి సృష్టి! విశ్వామిత్రుడు యీ శిల్పి కాలిగోరికి పోలుతాడా?"

శిల్పి బుగ్గలు ఎరుపెక్కాయి. చెప్పలేనంత సిగ్గు, విపరీతమైన అభిమానం పెల్లుబికి వచ్చాయి. ఆనంద బాష్పాలతో అమాంతం లేచి కూర్చున్నాడు "నిజంగానా?" అంటూ. "అవును నిజమే. నువ్వే అసలు శిల్పివి. చూస్తారేం? పట్టుకోండ్రా వీణ్ణి" అన్నాడు చిత్రగుప్తుడు.

* * *

పై కథ పిల్లల సాహిత్యంలో వెలువడినా అందులో ఎన్నటికీ వన్నెచెడని చక్కని నీతి ఉంది. పరుష వచనాలతో పాలు తాగించలేం కాని మంచి మాటలాడుతూ విషం పట్టవచ్చు. పాలుతాగే పాపాయినుంచి ఇంకోక్షణంలో తనువు చాలించే తాతయ్యవరకూ యీ మంచి మాట కావాలి. మనసులో ఎన్ని తిట్టుకున్నా పైకి యీ అధర మకరందం అందరూ ఆశిస్తారు. విసిగిపోయిన తల్లి పాలుపడుతూ మనసులో ఎంత విసుక్కున్నా పైకి ఎంతైనా పొగడ్డం గమనించవలసిన విషయం.

"మా పాపాయి ఎంతో మంచిది (అవును వర్ణించలేం—ఇది పిల్లా, రాక్షసిగాని!) ఎంత మంచిదో నిజంగా చెప్పలేము. వాళ్ళప్లీడరుగారి పాపాయి ఉందే తట్టిపెంకిదీ (దానికీదీనికీ పోలిక ఏమిటి? అది సుగుణాలరాసి) ఏదీ ఆ అనమ్మా, మా ఆమ్మే, నా కన్నతల్లే (మా అసిరమ్మే, మా సైతానే—ప్రత్యేకించి నన్నేడిపించడానికి పుట్టిన పెద్దమ్మవారే) అని పైకంటేగాని పాపాయినోరు విప్పి రెండుగుక్కలుతాగదు. ఉన్నన్నాళ్ళూ తగవులుపెట్టి, మనసులువిరిచి మంచం ఎక్కి దగ్గిర్నుంచీ మరీ కాల్చుకుతిని 'చావాచావడు, చాపాయివ్వడు' అనిపించిన తాతయ్యనుకూడా "తాతయ్యా నువ్వుపోతే ఎవరు దిక్కు? (కావలసినంతదిక్కు. నువ్వులేకపోతే నీడబ్బు మాకొస్తుంది, హాయిగా బతుకుతాం) నీ చల్లని చూపులూ, సౌమ్యవచనాలూ యీ జన్మలో మరచిపోగలమా? (ఎంతమాత్రం ఒక్కజన్మలో

మరచిపోలేం ఆఖరాఖరిని నువ్వు పెట్టిన అల్లరి జన్మజన్మాలూ చెప్పుకుంటాం) మేమెంత దురదృష్టవంతులం! మా కేమిటో భయంగా ఉంది. ఇటుచూడు తాతయ్యా (నిజమే గుడ్లు మిటకరించి నువ్వింకెన్నాళ్లు చూస్తావో అని మాకు భయంగానే ఉంది. వీలయినంత త్వరగా కళ్లుముయ్యి తాతయ్యా) అని సముదాయించాలి.

* * *

దుర్యోధను డంతటివాడ్ని కూడా అతని శౌర్యపరాక్రమాల్ని పొగడితేగాని ఆఖరికి నీటిలోంచి పైకిరాలేదు. మనందరికీ నిజమయినా నటనని తెలిసిపోయినా మనగురించి మంచిమాట కావాలి. ఈ పొగడ్తకి అర్హ్వాలం అవునా కామా అని మనం ఆలోచించం. మనగురించి మనం కొట్టుకున్న 'సొంతడబ్బా' చాలక అవతలవారినుంచి కూడా బాజాభజంత్రీలు ఆశిస్తాం. మనల్ని నిత్యం మెచ్చుకొనేవాళ్ళని వెదుకుదామని, దగ్గరచేసుకుందామని మనకళ్ళూ, మనసూ నిత్యం వెతుకుతూ ఉంటాయి. లేకపోతే ఇంతమంది "తైరుదాసు"లకి ఆశ్రయం దొరకదు.

* * *

ఆడదాని మెప్పుపొందాలంటే అతిగావర్ణించమని ఓ అనుభవసూక్తి. వేళ్ళదగ్గిర్నుంచీ, ఆఖరికి పట్టుకున్న పాత్రదగ్గిర్నుంచి వర్ణించాలిట. వెనక ఒకచెట్టుక్రింద ఒక కోమలాంగి నీళ్లబిందె పట్టుకు వస్తోంది. కాస్త కనుచీకటివేళ, తగిన చకోరాక్షి దొరకక విరహం అనుభవిస్తున్న మా సుబ్బారాయుడు ఆవిడ వెంటపడ్డాడు, "బిందె ఎంత చక్కగా మెరుస్తోందో! ఎక్కడ పుచ్చుకున్నారు వదినా?" ఆవిడ అయిదు నిముషాలు అదోలా చూసింది. ఆ చూపులో అర్థం వాడికి బోధపడలేదు. నేనురమ్మని సంజ్ఞచేసినా వాడు వినిపించుకోలేదు.

"ఆ బిందెమీద మీ సన్ననివేళ్ళు నాట్యం చేస్తున్నాయి" అన్నాడు మళ్ళీ.

"ఇంకా చాలాచోట్ల నాట్యం చేస్తాయి. గంతులేస్తాయి" అంది కోయిలకంఠంతో.

మనవాడు మైమరచి "ఎక్కడా?" అనేశాడు.

"ఇదుగో యిక్కడా" అంది. మరుక్షణంలో ఏదో చప్పుడయింది. ఆవిడ వెళ్ళిపోకుండా మావాడిపొంగిన బుగ్గనుచూసి,

"బిందె ఎంతచక్కగా మెరుస్తోందో, ఎక్కడ పుచ్చుకున్నారు మరిదీ?" అని నవ్వుకుంటూ వెళ్లిపోయింది. "తరలాక్షుల అరచేతులు చిగురుటాకులు అనరూ?" అన్నాడు వాడు మెరకదారిని ఎద్దుబండీ చేసే చప్పుడుగల కంఠంతో. నేను ఊరుకోలేదు. "పూర్తిగా కడుపునిండని మన చిత్రకారులకీ కవులకీ అతిశయోక్తి పైత్యాలకేం లోటూ? హరిమధ్యలూ చంద్రాననలూ సచిత్ర వారపత్రికల్లో చూస్తున్నాంగా. రెండు కళ్లు చాలవు!" అన్నాను ఒళ్లుమండి.

* * *

"నాకు ఎన్నేళ్లు ఉన్నాయంటావు?" అన్నాట్ట బాబాయి చేసుకోబోయే పెళ్ళికూతురితో.

"మీకేం నలభై దాటి ఉండవు. తుమ్మెద రెక్కల్లా జుత్తూ, మిరపకాయల్లాంటి మీసాలూ, ఇంద్రధనుస్సులాంటి ఛాతీ మీతో అస్థిపంజరాల్లా ఉన్న ఏ యువకుడు సరితూగుతాడూ? ఇందరు ఉండగా నన్నే వరించటం యీ దాసీ అదృష్టం" మా బాబాయి పొంగి బోర్లాపడ్డాడు. ఆరువందల రూపాయిలు చీరలకని యిచ్చి యింటికి వచ్చి మాతో యీ విషయం చెప్పేడు. అరవై ఏళ్ళ తన్ని యిరవై ఏళ్ళ కన్య వరించగలదా లేదా అన్న అనుమానమే కలగకపోడం బాబాయి దురదృష్టం. "మొదట అనుకుందిట, మళ్లీ మనసు మార్చుకుందిట, మేమేం చెయ్యగలం?" అని పిల్ల తండ్రి ఉత్తరం రాసినప్పుడుగాని బాబాయికంటి పొరలూడలేదు.

* * *

ఇది ప్రచారయుగం. అమ్ముతున్నవి మాటలుగాని వస్తువులుకాదు. ఈ స్తుతివల్లనే ఎవరైనా బోర్లాపడతాం. దేవుడికి సహితం సహస్రనామార్చన జరిగితీరాలి. కంటబడిన పురాణంలో 'కృష్ణలీలలు' విసుగెత్తేదాకా వర్ణించబడి ఉండాలి. రాజులకి వంధిమాగధులూ, భట్రాజులూ కావాలి. సినిమా తారలకి అందుబాటులో ఒక తైరుపత్రిక చుట్టూ భజనపార్టీ ఉండితీరాలి. మాంసంముక్క పడిపోయినాసరే 'ఎంతబాగా పాడగలవు కాకిబావా?' అనాలి. ఉన్నమాట ఒప్పుకోంగాని, కృత్రిమమైన యీ ముచ్చకాలు అందరికీ కావాలి.